క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆరిలోవ : విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టడంతో గురువారం పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ సబ్ స్టేషన్ విమ్స్‌కి సంబంధించిన 11 కేవీ ఫీడర్ నిర్వహణ, చెట్ల కొమ్మలు తొలగించడం తదితర పనులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ (ఆపరేషన్స్) బి.సింహాచలం నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీని పరిధిలో ఉన్న విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, షిర్డీసాయి నగర్, వెటర్నరీ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, ఇందిరానగర్, రాజీవ్ నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్, తోటగరువు ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

- ఆరిలోవ సబ్ స్టేషన్ 220 కేవీ పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ చార్జింగ్ కోసం విద్యుత్ విభాగం అధికారులు లైన్ క్లియరెన్స్ పనులు చేపట్టనుండడంతో గురువారం పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. దీనివల్ల రవీంద్రనగర్, తోటగరువు, బీటీఆర్ నగర్, గణబాబు నగర్, గాంధీనగర్, అన్నానగర్, బాలాజీనగర్, పాత ఆరిలోవ, బీసీ కాలనీ, చినగదిలి, పెదగదిలి, నేతాజీనగర్, సంతపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ బి.సింహాచలం నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.


సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అపరంజి

మద్దిలపాలెం : అత్యవసర సమయంలో సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడొచ్చని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.అపరంజి అన్నారు. సీపీఆర్‌పై ఏయూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణను బుధవారం ఆమె ప్రారంభించారు. జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సీపీఆర్‌పై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. వీసీ జీ.పి.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులంతా తర్ఫీదు పొందాలన్నారు. విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎస్.హరినాథ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.నరసింహారావు, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ప్రొఫెసర్ డాక్టర్ రివీస్, ఆచార్య రాజేంద్రప్రసాద్, ఆచార్య రాఘవరావు, ఆచార్య సౌజన్య పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు



జీవీఎంసీ సిబ్బంది తొలగించిన చెట్ల కొమ్మలు

ఎంవీపీ కాలనీ : ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్ సరఫరా అంతరాయానికి కారణమవుతున్న చెట్ల కొమ్మలను జీవీఎంసీ సిబ్బంది తొలగించారు. ఎంవీపీ కాలనీలోని పలు రోడ్లలో బుధవారం విస్తృతంగా ఈ కార్యక్రమం కొనసాగింది. ఎంవీపీ కాలనీలోని పలు సెక్టార్లతోపాటు లాసన్స్ బే కాలనీ, బీచ్‌రోడ్డులో కోనోకార్పస్ చెట్ల కొమ్మలను తొలగించారు.

ముగిసిన వరల్డ్ స్పేస్ వీక్ సదస్సు

మద్దిలపాలెం : ఏయూ జియో ఇంజినీరింగ్‌కి సంబంధించిన ఊర్విక్షతి స్టూడెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వరల్డ్ స్పేస్ వీక్ – 2025 సదస్సు ముగింపు కార్యక్రమం బుధవారం వైవీఎస్ ఆడిటోరియంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు హాజరై చివరి రోజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి సదస్సును విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఏయూ జియో ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.జగదీశ్వరరావు సొసైటీ కార్యకలాపాలను వివరించారు. ఈ వరల్డ్ స్పేస్ వీక్ సందర్భంగా నిర్వహించిన ఐడియాథాన్‌లో విజేతలకు రిజిస్ట్రార్ రాంబాబు, విభాగాధిపతి జగదీశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ మురళీకృష్ణ, సలహాదారుడు ప్రొఫెసర్ విక్టర్ బాబు, ప్రధాన కార్యదర్శి కె.ఎల్.ఎస్.పి.వర్షిణి, సంయుక్త కార్యదర్శులు పి.సంజన, డీఎస్ఎస్ చంద్రవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు అస్తవ్యస్తం

- జీవీఎంసీ 22వ వార్డులో ఎక్కడికక్కడ తవ్వి వదిలేసిన గోతులు
- సకాలంలో పనులు పూర్తికాక స్థానికులకు ఇబ్బందులు
- కొన్నిచోట్ల నాసిరకంగా పనులు
- పర్యవేక్షించని ఇంజినీరింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు



పిఠాపురంకాలనీలో కళాభారతి సమీపంలో తవ్విన గోతిలో కూరుకుపోయిన కారు



రోడ్లపై ఇష్టానుసారంగా కుప్పలుగా వేసిన నిర్మాణ సామగ్రి



జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలో శివాలయం వద్ద అస్తవ్యస్తంగా కల్వర్టు నిర్మాణ పనులు

మద్దిలపాలెం : జీవీఎంసీ పాలకవర్గం పదవీకాలం కొద్ది నెలల్లో ముగియనుండడంతో... 22వ వార్డుకు కేటాయించిన నిధులు సకాలంలో ఖర్చు చేయాలనే ఉద్దేశంతో అభివృద్ధి పనులు అస్తవ్యస్తంగా చేపడుతున్నారు. నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేస్తున్నారు. ఉపయోగం లేకపోయినా కాలువలకు మరమ్మతులు చేస్తూ ప్రజాధనం వృథా చేసేస్తున్నారు. వాటి నిర్మాణానికి నాసిరకం ఇసుక, సిమెంట్, ఇతర సామగ్రి ఉపయోగిస్తూ కాంట్రాక్టర్లు చేతివాటం చూపిస్తున్నారు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. మరోవైపు రోడ్లపై ఎక్కడిక్కడ నిర్మాణాల కోసమని తవ్విన మట్టిని కుప్పలుగా వదిలేస్తున్నారు. మరీ దారుణంగా కల్వర్టుల నిర్మాణానికి పనులు చేపట్టక ముందు గోతులు తవ్వేసి నెలలపాటు అలాగే వదిలేస్తున్నారు.

నిర్మాణ సామగ్రి సైతం రోడ్లపై ఇష్టానుసారంగా అడ్డదిడ్డంగా వేస్తున్నారు. దీంతో కాలనీవాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లు తాత్సారం చేయడంపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వార్డులో కొన్నిచోట్ల చేపడుతున్న పనులు వివాదాస్పదంగా కూడా మారుతున్నాయి. అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్న కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ సిబ్బంది తీరుపై కాలనీవాసులు మండిపడుతున్నారు.

నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు

జీవీఎంసీ పాలకవర్గం పదవీకాలం ముగిసేలోగా నిధులు ఖర్చు చేసేయాలనే తొందరలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నాసిరకంగా పనులు చేస్తున్నా కాసులకు కక్కుర్తిపడి అధికారులు కూడా చర్యలు చేపట్టడం లేదు. నిర్మాణాలకు నిబంధనల మేరకు ఇసుక, సిమెంట్, ఇతర సామగ్రి వినియోగించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అంతేకాకుండా కాంక్రీట్ పనులకు 20 రోజులపాటు వాటరింగ్ చేయాలి. కానీ ఒకటి రెండు రోజులపాటు వాటరింగ్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో నిర్మాణాలు పూర్తి చేసిన కొద్ది రోజులకే శిథిలమైపోయి అధ్వానంగా తయారవుతున్నాయి. మరోవైపు పనులను పర్యవేక్షించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది ఆయా ప్రాంతాల్లో కనిపించడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారంటూ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఆయా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తనిఖీ చేయాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనులపై జీవీఎంసీ కమిషనర్ ఆరా తీయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డుపైనే కుప్పలుగా నిర్మాణ సామగ్రి

జీవీఎంసీ 22వ వార్డులోని పిఠాపురంకాలనీ, పీతలవానిపాలెం, శివాజీపాలెం ప్రాంతాల్లో కాలువల నిర్మాణం చేపడుతున్నారు. ఈ నిర్మాణాలకు సంబంధించిన ఇసుక, రాయిని రోడ్లపై రాకపోకలకు అడ్డంగా కుప్పలుగా వేస్తున్నారు. దీంతో ఆ మార్గంలో వాహనాలు, పాదచారులు సైతం రాకపోకలు సాగించడానికి వీలులేక ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్, అధికారుల తీరుపై కాలనీవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ మిక్సింగ్ యంత్రాలను సైతం రోడ్డు మధ్యలోనే రాకపోకలకు అడ్డంగా పెట్టేస్తున్నారు. ఇలా ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నా ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పనులు ఎలా జరుగుతున్నాయో కనీసం ఆరా తీయడం లేదు.

ముందస్తు సమాచారం లేకుండానే తవ్వకాలు

వార్డులోని అపార్టుమెంట్ల వద్ద కాలువల నిర్మాణానికి గోతులు తవ్వే ముందు స్థానిక నివాసులకు సమాచారమివ్వాలి. అలా చేస్తే అపార్ట్‌మెంట్‌లో పార్కింగ్ చేసిన కార్లు, ఇతర వాహనాలను వేరే చోట పెట్టుకుంటారు. అలా చెప్పకుండా కాంట్రాక్టర్ అపార్ట్‌మెంట్ల ప్రవేశ ద్వారాల ముందు గోతులు తవ్వించేశారు. దీంతో షెల్లార్లలోని వాహనాలు వెలుపలకు తీసుకురావడానికి వీలులేక... ఎక్కడికైనా వెళ్లాలంటే వాహనాలు అందుబాటులో లేక నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా ఎలా చేస్తారని అడగడానికి ఆ పనులు చేపట్టే చోట కూలీలు తప్ప కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ సిబ్బంది ఎవరూ కనిపించడం లేదు. ఇదే విషయంపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదు చేస్తే పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి తమ కార్లు అపార్ట్‌మెంట్‌లో పార్కింగ్ చేసి వుండిపోయాయని... ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిఠాపురం కాలనీ కూరగాయల మార్కెట్ రోడ్డులో కల్వర్టు వద్ద మట్టికుప్పలు

కల్వర్టుల నిర్మాణంలో తీవ్ర జాప్యం

జీవీఎంసీ 22వ వార్డులోని కాలనీల్లో వీధులకు వెళ్లే మార్గంలో కల్వర్టుల నిర్మాణానికి గోతులు తవ్వేశారు. కొన్ని చోట్ల వీధులకు అనుసంధానంగా మరో మార్గం లేని చోట కూడా గోతులు తవ్వి వదిలేశారు. దీంతో ఆ వీధుల్లోని నివాసితుల వాహనాల రాకపోకులకు ఇబ్బందుల తలెత్తుతున్నాయి. అంతేకాకుండా తవ్విన గోతుల్లో వాహనాలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. పిఠాపురం కాలనీలో కళాభారతి ఆడిటోరియం ఎదురు వీధిలోకి వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మాణానికి గోతులు తవ్వి రెండు నెలలవుతోంది. నేటికీ అక్కడ పనులు పూర్తి చేయలేదు. దీంతో కాలనీవాసులు ఇంజినీరింగ్ అధికారుల నిర్వాకంపై నిప్పులు చెరుగుతున్నారు. ఇదేనా అభివృద్ధి పనులు చేపట్టే తీరంటూ మండిపడుతున్నారు.

ఆరిలోవ రైతుబజార్‌కు పెరుగుతున్న ఆదరణ



ఆరిలోవ రైతు బజార్‌లో కాయగూరలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



టమాటా స్టాల్ వద్ద వినియోగదారుల రద్దీ

ఆరిలోవ : ఆరిలోవ రైతు బజార్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ఈ నెల 2న ఆరిలోవ వాసుల కోసం బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి బ్రిడ్జి పక్కన రైతు బజార్ ప్రారంభించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి వినియోగదారుల రద్దీ పెరుగుతోంది. మార్కెటింగ్ శాఖ అధికారులు ఈ రైతు బజార్‌కు ప్రతీ మంగళవారం సెలవు కూడా ప్రకటించారు. ఇంతవరకు కాయగూరలతోపాటు ఒక్కొక్క స్టాల్ పెరుగుతూ వస్తోంది. నాలుగు రోజుల క్రితం గుడ్ల స్టాల్ ఏర్పాటు చేయగా బుధవారం మొదటి సారిగా పండ్ల దుకాణం కూడా ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో పూలు, కిరాణా సామగ్రి కూడా అందుబాటులో ఉండే విధంగా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. అన్ని కూరగాయలు ఇక్కడ లభ్యమవుతుండటంతో ఆరిలోవ కాలనీ, బాలాజీనగర్, తోటగరువు, చినగదలి, పెదగదిలి, హనుమంతవాకతోపాటు డెయిరీఫారం, ఆదర్శనగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల నుంచి వినియోగదారులు అధిక సంఖ్యలో ఇక్కడకు వస్తున్నారు. దూరప్రాంతాలైన పైనాపిల్‌కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం ప్రాంతీయులకు కూడా ఈ రైతు బజారే అందుబాటులో ఉంది. ఇక్కడ ప్రస్తుతం కొత్త కావడంతో ఒక్కొక్కటి చొప్పున నిర్వహిస్తున్న టమాటా, ఉల్లి, బంగాళదుంపల స్టాళ్లు వద్ద వినియోగదారుల రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది. భవిష్యత్‌లో వీటి విక్రయాల స్టాళ్లు పెంచాల్సిన అవసరం ఉంది.

వైఎస్సార్‌సీపీ నాయకురాలికి నివాళి



జగదీశ్వరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కాగితాల రామారావు సతీమణి స్వర్గీయ కాగితాల జగదీశ్వరి దశదిన ఖర్మలో పాల్గొని ఆమె చిత్రపటానికి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు నివాళులర్పించారు. రాష్ట్ర మత్స్యకారశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చల సురేష్, వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి, నీలారెడ్డి, తరుణ్ రెడ్డి, దుంప రవి, మద్ది వెంకటరమణ రెడ్డి, లక్ష్మణరెడ్డి, కాగితాల గోపి, మంగరాజు, వెంకటరమణ రెడ్డి, కాగితాల లక్ష్మణ్ రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

విభజన హామీల అమలుకు డిమాండ్



నిరసన తెలుపుతున్న అఖిల భారత యువజన సమైఖ్య సభ్యులు

బీచ్‌రోడ్డు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని కోరుతూ అఖిల భారత యువజన సమైఖ్య ప్రతినిధులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, ఎం.యుగంధర్ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయం ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయిందన్నారు. కూటమి నాయకులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం లేదని విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు హోదా సంజీవిని కాదని... ప్యాకేజీ మంచిదని చెప్పి ప్రత్యేక హోదా నినాదాన్ని పాతాళానికి తొక్కేశారని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తోందని, ఇందులో భాగంగానే వీఆర్ఎస్, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, ప్లాంట్ ఉద్యోగుల కుదింపు వంటివి చేస్తోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అచ్యుతరావు మాట్లాడుతూ జీఎస్టీ పేరుతో గత ఎనిమిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుందన్నారు. జీఎస్టీ 2.0తో సామాన్యులకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలని చూస్తుంటే... ఇక్కడి కూటమి నాయకులు ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు, సహాయ కార్యదర్శి కొమరం సందీప్, శివ, యు.నాగరాజు, కార్యవర్గ సభ్యులు మధు రెడ్డి, కెల్లా రమణ, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం స్వీకరిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి నగరంలోని కేఆర్ఎం కాలనీకి చెందిన బి.మాధవరావు దంపతులు లక్షా ఒక రూపాయి విరాళం అందించారు. బుధవారం దేవస్థానం పీఆర్వో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దాత నుంచి డిప్యూటీ ఈవో సింగం రాధ ఆ నగదును స్వీకరించారు. వారికి ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం కల్పించి, స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం, అన్నప్రసాదం బాండ్‌ను అందజేశారు. ఆలయ పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్, ప్రొటోకాల్ పర్యవేక్షణాధికారి పి.సునీల్‌కుమార్, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అత్యధిక సంతకాలు సేకరించాలి

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజలను చైతన్యపరచాలి
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా విశాఖ తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా సంతకాలు సేకరించి రికార్డు సృష్టించాలని సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. సీతమ్మధారలోని కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఎలా నిర్వహించాలో సలహాలు, సూచనలు అందించారు. అభిమానులు, సానుభూతిపరులతో కార్యకర్తలు సంతకాలు సేకరించాలని సూచించారు. మెడికల్ కళాశాలను ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను క్షేత్ర స్థాయిలో వివరించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ సాగాలన్నారు. సమావేశంలో 9వ వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకట స్వాతి దాసు, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముచ్చల సురేష్, రాష్ట్ర గ్రీవెన్స్ విభాగం ప్రధాన కార్యదర్శి సత్తి మందారెడ్డి, రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాస్‌రెడ్డి, తూర్పు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.శిరీష, పతివాడ వెంకటలక్ష్మి, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షురాలు పీలా జోశీల, యువజన విభాగం అధ్యక్షుడు కాగితాల రవికిరణ్ రెడ్డి, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, బీసీ విభాగం అధ్యక్షుడు బేతా దుర్గారావు, ఎంప్లాయిస్ – పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడు ఎంరెడ్ల ఈశ్వరరెడ్డి, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు కోన కామేష్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు బంగారు భవానీశంకర్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు మక్బూల్, లీగల్ సెల్ విభాగం అధ్యక్షుడు మొల్లి సింహాద్రి, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడు మద్ది వెంకటరమణ రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పిలక తరుణ్ రెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షుడు సంపంగి సురేష్, చేనేత విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి రావాలు, క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్, 23వ వార్డు ఇన్‌చార్జి పులగం సూర్యనారాయణ రెడ్డి, వార్డు అధ్యక్షులు పతివాడ కనకరాజు, ముగడ రమేష్, మొల్లి హేమంత్, సత్యాల వెంకట్, చొల్లంగి నాగేశ్వరరావు, పలికిల నీలారెడ్డి, ఉమ్మిడి కళ్యాణ్, యనమరెడ్డి కుమార్ రెడ్డి, మధుపాడ రవి, బూస రమణరెడ్డి, ప్రసంగి వాసు, కాశి, అబ్దుల్ రావుఫ్, పార్వతి, బంగార్రాజు, సురేష్, మహేష్, కనకరాజు, గుదే శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోరుగా సంతకాల సేకరణ



మాట్లాడుతున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు : ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించకుండా అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం జీవీఎంసీ 28వ వార్డులో ప్రారంభించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశనిర్దేశం చేశారు. సమావేశంలో వార్డు అధ్యక్షుడు రాపాక శ్రీనివాసరావు, సంపంగి శ్రీనివాసరావు, తోటపల్లి శ్రీనివాసరావు, భవానీశంకర్, పాల్గొన్నారు.

ఘనంగా వైట్ కేన్ డే



ర్యాలీ ప్రారంభిస్తున్న కార్పొరేటర్, తదితరులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని హెలెన్ కెల్లర్ దివ్యాంగుల పాఠశాలలో బుధవారం వైట్ కేన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీపీ కాలనీ సర్కిల్ నుంచి పాఠశాల వరకు తెలుపు రంగు కర్రలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మంగవేణి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తులు మాట్లాడుతూ అంధులకు తెలుపు రంగు కర్రల ద్వారా అందే సాయం విశిష్టమైనదన్నారు. అందువల్లే దాన్ని తెలుపు రంగు కర్రగా కాకుండా వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా వర్ణిస్తారన్నారు. దీన్ని పురస్కరించుకునే ఏటా ప్రపంచ వ్యాప్తంగా వైట్ కేన్ డే వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. స్కూల్‌లోని దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ వంటి సంస్థల కృషిని నిర్వాహకులు ప్రశంసించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు పలు ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెలెన్ కెల్లర్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు భీమారావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మనిర్భరతకు స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలామ్

మద్దిలపాలెం : ఆత్మనిర్భరతకు స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలామ్ అని బీజేపీ నాయకుడు మూల వెంకటరావు కొనియాడారు. కలాం 94వ జయంతి సందర్భంగా బుధవారం ఏయూ ఆర్ట్స్ కళాశాల వద్ద గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ క్షిపణి పితామహుడు డాక్టర్ అబ్దుల్ కలామ్ శాస్త్ర సాంకేతిక రంగంలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కలాం పర్యవేక్షణలోనే పోఖ్రాన్ పరీక్షలు నిర్వహించారని గుర్తు చేశారు. బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూర్‌భాషా షరీఫ్, పార్టీ మీడియా కో ఆర్డినేటర్ కేశవ్ కాంత్, తదితరులు పాల్గొన్నారు.

అనధికార బాణసంచా నిల్వలపై దాడులు



టాస్క్‌ఫోర్స్‌సిబ్బంది స్వాధీనం చేసుకున్న బాణసంచా

ఎంవీపీకాలనీ: నగరంలో అనధికారికంగా బాణసంచా నిల్వ చేస్తున్న వారిపై సిటీ టాస్క్‌ఫోర్స్ కొరడా ఝుళిపిస్తోంది. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు.. ఎంవీపీ కాలనీలోని టాస్క్‌ఫోర్స్ బృందం నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో విస్తృత దాడులు చేస్తోంది. ఆయా దాడులకు సంబంధించిన వివరాలను బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెల్లడించారు. కొత్తదిబ్బపాలెం, హెచ్.ఆర్.కాలనీకి చెందిన వద్ర అప్పలరాజు వద్ద నుంచి రూ.40 వేలు విలువ చేసే బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గాజువాక స్కూల్‌రోడ్డు ప్రాంతానికి చెందిన బొద్దు గాంధీ నుంచి రూ.లక్ష విలువ చేసే బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఇద్దరిపై కేసులు నమోదు చేసి, తదుపరి విచారణ నిమిత్తం ఆయా ప్రాంతాల పరిధిలోని పోలీస్‌స్టేషన్లకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి అనధికారిక దుకాణాల గురించి సమాచారం తెలిస్తే 112కు గానీ, 79950 95799 నంబర్‌కు గానీ ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.